సాక్షి చిత్తూరు

శనివారం । 9 । డిసెంబర్ । 2023



సకాలంలో 'సర్టిఫికెట్'

ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను సకలంలో అందిస్తున్న సురక్ష క్యాంపులపై లబ్ధిదారుల జనవాక్కు. - 8లో



పకడ్బందీగా ఓటరు జాబితా

ప్రత్యేక ఓటరు సవరణ జాబితాను పకడ్బందీగా సిద్ధం చేయాలని అబ్జర్వర్ పోలా భాస్కర్ ఆదేశించారు. - 8లో



కాణిపాకంలో శరణుఘోష

కాణిపాకం వినాయకస్వామి ఆలయం శుక్రవారం అయ్యప్ప స్వామి భక్తులతో కిక్కిరిసిపోయింది. - 8లో

న్యూస్‌రీల్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

యాదమరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి వరదరాజుపల్లె గ్రామస్తులు క్షీరాభిషేకం చేశారు. శుక్రవారం గ్రామ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసినందుకు కృతజ్ఞతగా పాలాభిషేకం చేసినట్లు వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో సైతం మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా చేసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్, వైఎస్ ఎంపీపీలు హరనారాయణ రెడ్డి, రవీంద్ర బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, సర్పంచ్ పుష్ప పాల్గొన్నారు.

గజ బాధిత కుటుంబానికి భరోసా



చెక్ అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ఎర్రపాపిరెడ్డిగారిపల్లెకు చెందిన మస్తాన్(34) నాలుగు రోజుల క్రితం ఏనుగు దాడిలో మృతి చెందాడు. శుక్రవారం ఈ మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5లక్షల చెక్‌ను బాధిత కుటుంబానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అందజేశారు. మృతుడి భార్యకు రెండు ఎకరాల పొలం, హాస్టల్లో పని, పిల్లలను చదివించే ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, డీఎఫ్‌ఓ చైతన్య కుమార్‌రెడ్డి, రేంజ్ ఆఫీసర్ థామస్ సుకుమార్, విరూపాక్షి జయచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ రాశిప్రసాద్, ముర్వత్‌బాషా, షకూర్, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్, రవీంద్రారెడ్డి, దామోదర్ శ్రీధర్ పాల్గొన్నారు.

శ్రీసిటీ ఎండీ కుమార్తెకు మంత్రి ఆశీస్సులు



నవదంపతులతో మంత్రి రోజా దంపతులు

నగరి : శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవి సన్నారెడ్డి కుమార్తె నిరీష రెడ్డి, పంకజ చంద్ర పెళ్లి వేడుకకు మంత్రి ఆర్‌కే రోజా తన భర్త ఆర్‌కే సెల్వమణితో కలిసి హాజరయ్యారు. చెన్నైలోని యేయర్ రామనాథన్ సెంటర్‌లో నిర్వహించిన వివాహ మహోత్సవంలో నూతన వధూవరులను ఆశీర్వదించారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకం



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

చౌడేపల్లె : బోయ కొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువనే ఆలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయంలో అమ్మ వారికి అభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చిన అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు ఉచిత అన్నప్రసాదం పంపిణీ చేశఋారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి పర్యవేక్షణలో సుమారు వెయ్యి మందికి భోజనం వడ్డించారు. అన్నప్రసాదానికి అవసరమైన కూరగాయలను పలమనేరుకు చెందిన సీఎస్ నవీన్‌కుమార్ వారి మిత్రులు సమకూర్చారు.



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఈఓ చంద్రమౌళి

'జగనన్నా..! చేతికొచ్చిన పంట కొట్టుకుపోయింది. నోటికాడ కూడు తీసేసినట్టయ్యింది. రొయ్యల సాగు ఎందుకూ పనికిరాకుండా పోయింది. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక దిగులు పట్టుకుంది. ఎక్కడి నుంచి వచ్చిందో ఆ మాయదారి తుపాను.. మా ఆశలన్నీ ముంచేసింది. ఇళ్లను కూడా పెకలించి కూల్చేసింది. గ్రామాలనే తుడిచిపెట్టేసింది. గొడ్డూగోదా ఉసురు తీసింది' అంటూ వరద బాధితులు చెబుతున్న మాటలు విని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలించిపోయారు. అన్నదాతల ఆక్రందనకు ఆవేదనకు లోనయ్యారు. 'అధైర్యపడొద్దు.. అండగా ఉంటా'నంటూ భరోసానిచ్చారు. అన్ని విధాలా ఆదుకుంటానని ధైర్యం చెప్పారు.

వరద బాధితులకు సీఎం జగన్ కొండత ఓదార్పు

- అధైర్యపడొద్దు.. అండగా ఉంటానని భరోసా
- బాధితుల ఇక్కట్లు విని చలించిపోయిన ముఖ్యమంత్రి
- రూ.30 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- అన్నదాతకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు





బాలిరెడ్డిపాలెంలో తెగిపోయిన స్వర్ణముఖి కరకట్టను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఇన్‌సెట్) తుపాను బాధితుల సమస్యలను ఆలకిస్తూ..

కన్నీళ్లు తుడుస్తూ..!

సాక్షి, తిరుపతి: తుపాన్ ప్రభావిత ప్రాంతాల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం గూడూరు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా ఆయన ఏరియల్ సర్వే చేశారు. ఆపై క్షేత్ర స్థాయిలో పర్యటించి వరద నష్టాన్ని స్వయంగా పరిశీలించారు. బాధితుల కష్టాలు విని చలించిపోయారు. అన్నదాతల కన్నీళ్లు తుడుస్తూ అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. వాకాడు మండలంలోని తొమ్మిది గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడకుండా స్వర్ణముఖి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వరదల కారణంగా పూర్తిగా దెబ్బతిన్న పంటలు తిరిగి వేసుకునేందుకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సీఎం ప్రకటనపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు. వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాళెం పరిధిలో కోతకు గురైన స్వర్ణముఖి నది లోలెవల్ కాజ్‌వే, వరి పంటలను పరిశీలించి ఆవేదనకు లోనయ్యారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యే వరప్రసాద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.



ముఖాముఖిలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

బారులుదీరిన అభిమానం

సీఎం వస్తున్నారని తెలుసుకున్న స్థానికులు విద్యానగర్ నుంచి బాలిరెడ్డిపాళెం వరకు బారులు తీరారు. తమ రాకకోసం నిరీక్షిస్తున్నారని గుర్తించిన ముఖ్యమంత్రి వారిని ఆప్యాయంగా పలకరించారు. రైతుల ఆవేదనను స్వయంగా ఆలకించారు. వృద్ధురాలి కన్నీటిని తుడుస్తూ.. 'ఏడవకు అవ్వా.. నేనున్నాను' అంటూ భరోసానిచ్చారు. మానవత్వంతో స్పందించిన తీరుని చూసి వృద్ధురాలు సీఎం ముఖాన్ని పట్టుకుని 'నువ్వు చల్లంగా ఉండాలి నాయనా' అంటూ దీవెనలందించారు. అక్కడే ఉన్న స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. 'జగన్ మామయ్యా.. జగన్ మామయ్యా' అంటూ తనవంక చూసి అరుస్తున్న చిన్నారుల వద్దకు వెళ్లి బుగ్గలు నిమిరారు. 'బాగా చదువుకోండి' అంటూ ముందుకు కదిలారు. ముఖాముఖి సమావేశంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను తీసుకుని వాటి పరిష్కరించాలని కలెక్టర్‌ని ఆదేశించారు. సాధారణ పరిస్థితులు నెలకొనేవరకూ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసానిచ్చారు. శరవేగంగా సాగుతున్న సహాయక చర్యలపై సీఎం నేరుగా ప్రజలతో మాట్లాడి వారి నుంచి వివరాలు తీసుకున్నారు. బాధిత కుటుంబాలకు అందించే నిత్యావసర సరుకుల పంపిణీపైనా ఆరా తీశారు. విద్యుత్, రహదారులు, తాగునీటి సౌకర్యం పునరుద్ధరణ, పంట నష్టం అంచనాకు సంబంధించి ఎన్యూమరేషన్ ప్రక్రియపై అధికారులను వివరాలు అడిగిన తెలుసుకున్నారు. శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆదిమూలం, కిలివేటి సంజీవయ్య తమ నియోజకవర్గాల్లో జరిగిన నష్టాలను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు.



దివ్యాంగుడి కష్టాలు వింటూ..



వృద్ధురాలితో ఆప్యాయతను పంచుకుంటూ..

అమ్మకు ఆపరేషాన్!

నేటి సమాజంలో మారుతున్న ఆహారపు అలవాట్ల కారణంగా పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా మహిళలను గర్భాశయ కష్టాలు వేధిస్తున్నాయి. ప్రధానంగా 30 ఏళ్లు పైబడిన వారినే అధికంగా ఇలాంటి రోగాలు వెంటాడుతున్నాయి. చివరకు శస్త్రచికిత్సలకు దారి తీస్తున్నాయి. ఈ క్రమంలో స్త్రీలు పలు దుష్ప్రభావాల బారిన పడాల్సివస్తోంది. మరెన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. తగు జాగ్రత్తలు పాటిస్తే ఆపరేషన్ వరకు వెళ్లాల్సిన అవసరం రాదని వైద్యఆరోగ్యశాఖ సూచిస్తోంది.

- మహిళల్లో పెరుగుతున్న గర్భాశయ సమస్యలు
- 30 ఏళ్లు పైబడిన వారిలో అధికం
- శస్త్రచికిత్సలతో తలెత్తుతున్న ఆరోగ్య ఇబ్బందులు



చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన మహిళలు (ఫైల్)

చిత్తూరు రూరల్ : శరీరంలోని అన్ని భాగాలకు సమస్యలు వచ్చినట్లే గర్భాశయానికి కూడా వస్తుంటాయి. అలా వస్తే చాలా మంది మహిళలు ఆపరేషన్ చేయించుకుని తొలగించుకుంటే మేలు అని భావిస్తున్నారు. దీంతో రుతుస్రావం వంటి సమస్యలు ప్రతినెలా తప్పుతాయని ఆలోచిస్తున్నారు. అందుకే ఎక్కువమంది శస్త్రచికిత్సకు వెళుతుంటారు. అయితే ఆపరేషన్ కారణంగా అండాశయానికి రక్త సరఫరాలో మార్పులు చోటుచేసుకుంటాయి. ఈస్ట్రోజన్ ఉత్పత్తి ఆగిపోతుంది. ఆ దుష్ప్రభావం అన్ని అవయవాలపై పడుతుంది. గర్భసంచిని తొలిగించిన తర్వాత చాలా మందిలో అండాశయాల పనితీరు కూడా తగ్గినట్లు వైద్యులు గుర్తించారు. ఎముకల్లో కాల్షియం తగ్గిపోయి పెలుసుబారిపోతున్నట్లు నిర్ధారించారు. అయితే మహిళల కోరిక మేరకు కొందరు డాక్టర్లు సైతం గర్భసంచి తొలగిస్తుంటారు. మరికొందరు వైద్యులు మాత్రం గర్భసంచి తీసేయడం అంత మేలైన మార్గం కాదని సూచిస్తున్నారు.

గర్భసంచిలో తలెత్తే సమస్యలు ఇవీ..

- గడ్డలు
- ఇన్ఫెక్షన్లు, వాపులు
- పుండ్లు
- క్యాన్సర్
- గర్భసంచి కిందకి జారిపోవడం
- తీవ్రమైన కడుపునొప్పి
- అధిక రక్తస్రావం

వ్యాధిలో రకాలు

- ఫైబ్రాయిడ్స్
- ఎండోమెట్రియోసిస్,
- సర్వేకల్
- ఎండో మెట్రియల్ క్యాన్సర్లు

నిర్లక్ష్యం చేస్తే..

- అధిక రక్తస్రావం కారణంగా రక్తహీనతకు గురవుతారు
- గడ్డలు పెరిగి ప్రాణం మీదకు వస్తుంది
- క్యాన్సర్‌కు దారితీస్తుంది.
- మూత్ర సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశముంటుంది

ఎప్పుడు తొలగిస్తారంటే...

- గర్భసంచిలో గడ్డలు పెద్ద పరిమాణంలో ఉంటే
- ప్రసవ సమయంలో తీవ్రంగా రక్తస్రావం
- క్యాన్సర్ నిర్ధారణ అయితే
- చీము సంచులున్నప్పుడు, అవి లోపల పగిలినప్పుడు

అవగాహన అవసరం



కటి భాగంలో గర్భసంచి సమస్యలపై మహిళలకు అవగాహన అవసరం. గర్భసంచి జారితే పేగు జారిందని భావిస్తుంటారు. అయితే నిజానికి తోసుకొచ్చేవి కటి భాగంలోని అవయవాలే. ఈ సమస్యను సరిదిద్దుకునే అవకాశమున్నా చాలామంది పైకి చెప్పుకోవటానికి వెనకాడుతుంటారు. ఈ ఇబ్బందిని అలాగే వదిలేస్తే ప్రాణానికే ప్రమాదం. సకాలంలో చికిత్స తీసుకుంటే మంచిది.

– మీనా సయ్యద్, గైనకాలజిస్ట్, సీహెచ్‌సీ, పెనుమూరు

వైద్యుల సలహాలు పాటించాలి



మెనోపాజ్‌కు సంబంధించిన సమస్యలైతే హార్మోన్ల ద్వారా చికిత్స చేయొచ్చు. పాలిప్స్ ఉంటే వాటిని హిస్టెరోస్కోపీ ద్వారా తొలగించవచ్చు. అలాగే లోపలి పొరలో ఫైబ్రాయిడ్ గడ్డలున్నా కూడా ఒక పరిమాణం వరకు హిస్టెరోస్కోపీ ద్వారా వాటిని తీసేయొచ్చు. ఎడినోమయోసిస్‌కు ప్రొజెస్టిరాన్ మాత్రలు లేదా మెరీనా లూప్ ద్వారా చాలావరకు ఉపశమనం లభిస్తుంది. కొన్ని సార్లు హిస్టరెక్టమీ ద్వారా గర్భాశయాన్ని తొలగించాల్సి ఉంటుంది. మందులతో నయం కానప్పుడు, బయాప్సీలో క్యాన్సర్ నిర్ధారణ అయినా హిస్టరెక్టమీని ఎంచుకుంటే మంచిది. వైద్యుల సలహాలను పాటించాలి. – ఉషశ్రీ, గైనకాలజిస్ట్, జిల్లా ఆస్పత్రి, చిత్తూరు

గర్భాశయ సమస్యలతో బాధపడేవారి సమాచారం

నెల	సమస్యల సంఖ్య	ఓపీ	ఆపరేషన్లు
జూన్	27	45	35
జూలై	35	01	42
ఆగస్టు	32	32	26
సెప్టెంబర్	29	65	35
అక్టోబర్	30	24	38
నవంబర్	27	81	41

జిల్లా సమాచారం

జిల్లా ఆస్పత్రి	ఏరియా వైద్యశాలలు	సీహెచ్‌సీలు	పీహెచ్‌సీలు	అర్బన్ హెల్త్ సెంటర్లు	నిత్యం వచ్చే అవుట్ పేషెంట్లు	ఇన్ పేషెంట్లు	గర్భసంచి సమస్యలతో వచ్చేవారు
01	04	07	50	14	10 వేలకు పైగా	సుమారు 3 వేలు	120 నుంచి 150 వరకు

14న పలమనేరులో 'బస్సు యాత్ర'

పలమనేరు: పట్టణంలలో ఈ నెల 14వ తేదీన వైఎస్సార్‌సీపీ సామాజిక బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెంకటేగౌడ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తుపాను కారణంగా యాత్రను ఇదివరకు వాయిదా వేశామన్నారు. ప్రస్తుతం మరింత అద్భుతంగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందని, ప్రత్యేక కార్పొరేషన్లతో అందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, మురళీకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, పార్టీ పట్టణ కన్వీనర్ జాఫర్, మాజీ కన్వీనర్ మండీ సుధ, పలమనేరు, గంగవరం మండలాల కన్వీనర్లు బాలాజీనాయుడు, మోహన్‌రెడ్డి, నాయకులు చంద్రప్ప, శ్యామ్, శ్యామ్‌సుందర్‌రాజు, రవి, గిరిరాజారెడ్డి, రహీంఖాన్, నాగరాజు, బాబురెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, పక్కన ఎమ్మెల్సీ భరత్ తదితరులు

క్లుప్తంగా

వరసిద్ధుని సేవలో ఎస్పీ



ఎస్పీ రిషాంత్ రెడ్డికి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని ఎస్పీ రిషాంత్ రెడ్డి కుటుంబ సమేతంగా శుక్రవారం సాయంత్రం దర్శించుకున్నారు. పుట్టినరోజు సందర్భంగా ఆయన కాణిపాకం విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేదపండితులు ఆశీర్వచనం అందించారు. అధికారులు తీర్థ ప్రసాదాలు, చిత్రపటం, శేషవస్త్రాలు అందజేశారు.

వెంకటాపురంలో చిరుత కలకలం

రామకుప్పం: మండలంలోని వెంకటాపురం అటవీ పరిసరాల్లో చిరుత సంచరిస్తున్న విషయం కలకలం రేపింది. మూడు రోజులుగా కర్ణాటక సరిహద్దులో తిరుగాడిన చిరుత శుక్రవారం వెంకటాపురం పరిసరాలకు చేరినట్లు గ్రామస్తులు వెల్లడిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న అటవీ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామస్తులకు కనిపించింది చిరుతా.. బావురుపిల్లినా తేలాల్సి ఉందని ఎఫ్ఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు.

కేంద్ర మంత్రి పర్యటన రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి భగవంత్‌కృష్ణారావ్ కరాద్ జిల్లా పర్యటన రద్దు అయినట్లు కలెక్టరేట్ అధికారులు శుక్రవారం వెల్లడించారు. వికసిత్ సంకల్ప్ యాత్ర పర్యవేక్షణకు ఈ నెల 9వ తేదీన కేంద్రమంత్రి జిల్లాకు విచ్చేయనున్నట్లు కలెక్టరేట్‌కు ఉత్తర్వులు అందాయి. అయితే అనివార్య కారణాలతో పర్యటన ఆగిపోయిందని అధికారులు తెలిపారు.

తల్లీబిడ్డ అదృశ్యంపై ఫిర్యాదు

చిత్తూరు అర్బన్: నగరంలోని ఇందిరానగర్‌కు చెందిన హేమలత (21) అనే వివాహిత తన కూతురితో సహా కనిపించకపోవడంపై భర్త విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. విజయ్‌కుమార్ భార్య తన రెండేళ్ల కుమార్తెను తీసుకుని గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె భర్త పోలీసులను ఆశ్రయించాడు. టూటౌన్ ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సులువుగా.. సకాలంలో సర్టిఫికెట్

జనవాక్కు

ఒకప్పుడు ఏదైనా సర్టిఫికెట్ పొందాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేంది. ఒక్కోసారి సంబంధిత అధికారుల చేతులు తడపాల్సి వచ్చేది. అయినప్పటికీ అనుకున్న సమయానికి కావాల్సిన ధ్రువీకరణ పత్రం చేతికందేది కాదు. అయితే ఇప్పుడు సర్కారు అమలు చేసిన జగనన్న సురక్ష పథకం కింద ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్ సకాలంలో ఇంటికే వచ్చేస్తోంది. పైసా ఖర్చు లేకుండా.. ఎవరి చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా సులువుగా వెతుక్కుంటూ వస్తోంది. ప్రతిష్టాత్మక పథకం ద్వారా లబ్ధి పొందిన ప్రజల ఆనందం వారి మాటల్లోనే..

– చిత్తూరు కలెక్టరేట్



సురక్ష క్యాంపులో సర్టిఫికెట్లు అందుకున్న లబ్ధిదారులు (ఫైల్)

ఇంటికే తెచ్చిచ్చారు



అధికారులు మా ఇంటికే సర్టిఫికెట్ తెచ్చిచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకంతో ఎంతో మేలు చేకూరంది. కుల ధ్రువీకరణపత్రం కోసం గతంలో చాలా సార్లు కార్యాలయాల చుట్టూ తిరిగా. ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం ఒక్క పైసా ఖర్చు లేకుండానే నాకు అవసరమైన సర్టిఫికెట్ అందజేశారు.

- ధనమ్మ, వేనూతనపల్లె, పూతలపట్టు మండలం

మేలు మరువలేం



అవసరమైన సర్టిఫికెట్లు సమయానికి రాకపోతే పడే బాధలు అన్నీ ఇన్నీ కావు. గతంలో ఎలాంటి ధ్రువీకరణ పత్రం కావాలన్నా మీ సేవ చుట్టూ తిరిగే వాళ్లం. అక్కడకు వెళితే గంటల కొద్దీ నిలబెట్టేవాళ్లు. మీసేవ నిర్వాహకులు అందినకాడికి దోచుకునే వారు. మా కష్టాలను చూసిన ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం ప్రారంభించింది. మాకు కావాల్సిన క్యాస్ట్ సర్టిఫికెట్‌ను ఇంటివద్దకే తెచ్చిచ్చారు. జగనన్న మేలు మరువలేం

- పి.రాజేశ్వరి, ఎగువ పాలకూరు, పూతలపట్టు మండలం

ఒక్కరోజులోనే..



నేను ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నా. ఒక్క రోజులోనే అధికారులు సర్టిఫికెట్లను మా ఇంటికే వచ్చి అందించారు. గతంలో ఈ పత్రాలు తీసుకోవాలంటే మీ సేవ కేంద్రాల వారికి రూ.500 ఇవ్వాల్సి వచ్చేంది. ప్రస్తుతం ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే మంజూరు చేశారు. చాలా సంతోషంగా ఉంది. **- జ్ఞానేశ్వరి, పాదిరేడు, వడమాలపేట మండలం**

జగనన్నకు కృతజ్ఞతలు



వాహనమిత్ర పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే కుల ధ్రువీకరణ పత్రం అవసరమైంది. వలంటీర్ వచ్చి మా ఇంటికే వచ్చి వివరాలు తీసుకున్నాడు. మా గ్రామంలో జగనన్న సురక్ష శిబిరం ఏర్పాటు చేసినప్పుడు మాకు కావాల్సిన సర్టిఫికెట్ అందించారు. ఇంత సులువుగా ధ్రువీకరణ పత్రాలు ఇప్పించిన జగనన్నకు కృతజ్ఞతలు.

- పి.అజంతుల్లా, కల్లూరు, పులిచెర్ల మండలం

నేడు జాతీయ లోక్ అదాలత్

చిత్తూరు అర్బన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాజీ చేసుకోదగ్గ కేసులను అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు. చిత్తూరు,మదనపల్లె, తిరుపతితో కలిపి ఉమ్మడి జిల్లాలో కక్షిదారుల కోసం 37 బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

వందేభారత్‌లో మంత్రి రోజా ప్రయాణం



తిరుపతి(అలిపిరి): తిరుపతి నుంచి గుంటూరు వరకు వందేభారత్ రైలులో మంత్రి ఆర్‌కే రోజా శుక్రవారం ప్రయాణం చేశారు. ట్రైన్‌లోని ప్రయాణికులతో రోజా ముచ్చటించారు. ప్రయాణికులు మంత్రితో సెల్ఫీలు దిగుతూ ఉల్లాసంగా గడిపారు.

నిత్యాన్నదానానికి రూ.2లక్షల విరాళం



ఆలయ అధికారులకు చెక్ అందిస్తున్న దాత

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి పుట్టపర్తి జిల్లా గోవిందపేటకు చెందిన ఎల్లమ్మ అనే దాత రూ.2లక్షల విరాళం అందించారు. శుక్రవారం ఈ మేరకు ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణికి చెక్ అందజేశారు.

సైనిక సంక్షేమశాఖాధికారికి పురస్కారం



అవార్డు అందుకుంటున్న విజయశంకర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి విజయశంకర్‌రెడ్డికి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. రాష్ట్ర సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.

విష జ్వరాలపై అప్రమత్తం

చిత్తూరు రూరల్: ఇటీవల కురిసిన వర్షాలతో విషజ్వరాలు ప్రబలుతున్నాయని, ప్రజలను అప్రమత్తం చేయాలని ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ రవిరాజు ఆదేశించారు. శుక్రవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. వాతావరణంలో మార్పుల కారణంగా జ్వరాలు విజృంభిస్తున్నాయని వెల్లడించారు.

9న మూడు మండలాల్లో పాఠశాలల నిర్వహణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని కార్వేటినగరం, నగరి, నింద్ర మండలాల్లో ఈ నెల 9వ తేదీన పాఠశాలలు నిర్వహించాలని డీఈఓ విజయేంద్రరావు ఆదేశించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల తుపాను కారణంగా ఈ మూడు మండలాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించామన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా రెండవ శనివారం పాఠశాలలు నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

కర్ణాటక మద్యం విక్రేతఅరెస్ట్

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న కె.వెంకటేశు (31) అనే వ్యక్తిని రూరల్ సెబ్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. యాదమరి మండలం కాశిరాళ్ల గ్రామం వద్ద సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో బైక్‌పై మద్యం తీసుకువెళుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని 43 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ట్రైనీ ఏఈఎస్ శ్రీరామ్, ఎస్ఐ మోహన్‌బాబు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల ఢీ : ఒకరి మృతి

వి.కోట: పలమనేరు– వి.కోట జాతీయ రహదారిలో శుక్రవారం రెండు బైక్‌లు ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. వివరాలు.. మండలంలోని పత్రపల్లెకు చెందిన బర్కత్(42) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో కృష్ణాపురం వద్ద మసీదుకు వెళ్లి నమాజ్ ముగించుకుని వి.కోటకు తిరుగుప్రయాణమయ్యాడు. బైరెడ్డిపల్లె మండలం కమ్మనపల్లెకు చెందిన వ్యక్తి బైక్‌పై వి.కోట నుంచి పలమనేరు వెళుతున్నాడు. మద్దిరాళ్ల గ్రామం వద్ద ఆ రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో బర్కత్ తలకు తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో వి.కోట సీహెచ్‌సీకి తరలించగా బర్కత్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగప్ప తెలిపారు.

కారు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

గంగవరం : మండలంలోని పెద్ద ఉగిణి వద్ద కారు ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. మరో వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. బైరెడ్డిపల్లె మండలం మురారిపల్లెకు చెందిన సుబ్రమణ్యం(42), చౌడప్ప(77) స్కూటీలో పలమనేరు నుంచి స్వగ్రామానికి వెళుతుండగా వెనకనుంచి కారు ఢీకొంది. చౌడప్పను పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. సుబ్రమణ్యం కుప్పం మెడికల్ కళాశాలలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

చిత్తూరు అర్బన్: నగర శివారులోని కురప్పల్లె వద్ద పేకాట ఆడుతున్న పది మందిని తాలూక పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.8,800 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం

బైరెడ్డిపల్లె : మండలంలోని చీలంపల్లె, సాకేవూరులో సాగు చేస్తున్న పంటలను గురువారం రాత్రి ఏనుగులు ధ్వంసం చేశాయి. నాగరాజు, సుబ్రమణ్యం, సురేష్ అనే రైతులకు చెందిన అరటి తోటలను నాశనం చేశాయి.




ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి




ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి రోజా, సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

సీఎం జగన్‌కు సాదర స్వాగతం

రేణిగుంట: తిరుపతి జిల్లాలో మిచాంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటన నిమిత్తం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సాదర స్వాగతం లభించింది. ఆయన శుక్రవారం ఉదయం 10.18 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకోగా, ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, డీఐజీ అమ్మిరెడ్డి, తిరుపతి మేయర్ శిరీష, శ్రీకాళహస్తి ఆర్‌డీవో రవిశంకర్‌రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన 10.30 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటన నిమిత్తం వాకాడుకు వెళ్లారు. ముఖ్యమంత్రి వెంట హోంశాఖ మంత్రి తానేటి వనిత, ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న ఎన్నికల రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పకడ్బందీగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024 చేపట్టాలని ఎన్నికల రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ అభ్యంతరాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాజకీయపార్టీలవారు బీఎల్ఏ (బూత్ లెవల్ ఏజెంట్)లను నియమించుకోవాలని సూచించారు. ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, తహసీల్దారుప్లు, బీఎల్‌ఓలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. విధి నిర్వహణలో అలసత్వం వహించకూడదని స్పష్టం చేశారు. యువ ఓటర్ల నమోదులో జిల్లా మెరుగైన స్థానంలో ఉందని చెప్పారు. ప్రతి అభ్యంతరాన్ని బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. మృతులు, వలస వెళ్లిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించేటప్పుడు నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో పురుషులు 7,63,671 మంది, మహిళలు 7,81,887 మంది, ఇతరులు 108 మంది, సర్వీస్ ఓటర్లు 3,486 మంది మొత్తం 15,49,152 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. మొత్తం 1,762 పోలింగ్ స్టేషన్‌లకు గాను 176 మంది సూపర్‌వైజర్లు, 422 మంది వీఆర్‌ఓలు, 74 మంది వీఆర్‌ఏలు, 1,025 మంది గ్రామ,వార్డు సచివాలయ సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. కసరత్తు పకడ్బందీగా నిర్వహించి జనవరి 5వ తేదీ నాటికి తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు, ఇన్‌చార్జి డీఆర్‌ఓ శివయ్య, ఆర్డీఓలు చిన్నయ్య, సుజన, మనోజ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ భవానీ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, రాజకీయపార్టీల ప్రతినిధులు ఉదయ్‌కుమార్, పులివర్తి నాని, దొరబాబు, మురళీమోహన్, గంగరాజు, అట్లూరి శ్రీనివాసులు, పరదేశి పాల్గొన్నారు.

పక్కాగా క్లెయిమ్స్ పరిష్కారం

శ్రీరంగరాజపురం : ఓటర్లు జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి వచ్చిన క్లెయిమ్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించి పక్కాగా పరిష్కరించాలని ఎన్నికల రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని క్షీరసముద్రంలో కలెక్టర్ షణ్మోహన్‌తో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా 151, 152 పోలింగ్ కేంద్రాల పరిధిలో అందిన క్లెయిమ్స్ పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు.

కాణిపాకంలో శరణుఘోష



క్యూలో కిక్కిరిసిన భక్తులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం శుక్రవారం అయ్యప్ప భక్తులతో కిక్కిరిసింది. ఉదయం నుంచి భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో స్వామివారి దర్శనానికి దాదాపు 5 గంటల సమయం పడుతోంది. శబరిమలై యాత్రకు వెళుతున్న అయ్యప్ప మాలధారులు తొలుత వరసిద్ధుని సేవించుకునేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో క్యూ నిండిపోవడంతో బయట వరకు బారులుతీరారు. కాణిపాకంలో ఎక్కడ చూసిన అయ్యప్పస్వాములే కనిపిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు ఏర్పాటు చేయించారు. దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లిదండ్రులు, వృద్ధులకు ప్రత్యేక క్యూ ద్వారా స్వామివారి దర్శనం కల్పించారు.

12 నుంచి ఫ్రిడ్జ్, ఏసీల మరమ్మతులపై శిక్షణ

చంద్రగిరి: గ్రామీణ ప్రాంతాల పురుషులకు ఉచిత ఉపాధి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు యూనియన్ బ్యాంకు గ్రామీణ ఉపాధి సంస్థ డైరెక్టర్ సురేష్ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12 తేదీ నుంచి 30 రోజుల పాటు రిఫ్రిజిరేటర్, ఏసీ మరమ్మతులు, సర్వీసింగ్‌పై శిక్షణ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన, 19– 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, కనీసం 10వ తరగతి చదువుకున్న నిరుద్యోగ పురుషులు అర్హులని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రాను–పోను ఒక్కసారి బస్సు చార్జీ ఇవ్వడంతో పాటు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు జిరాక్స్, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో నేరుగా సంస్థ వద్దకు వచ్చి, పేర్లను నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఒక్క బ్యాచ్‌కు 25 నుంచి 30 మందిని మాత్రమే చేర్చుకుంటామని, ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి సంస్థ, ద్వారకా నగర్, కొత్తపేట, చంద్రగిరి, 79896 80587, 94949 51289 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

– మరొకరి పరిస్థితి విషమం



గాయపడిన బావాజాన్

పూతలపట్టు : చిత్తూరు–పలమనేరు రహదారిలో గురువారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. పాకాల మండలం కుక్కలపల్లెకు చెందిన గజపతి కుమారుడు సాయికుమార్(23), సూరినేనివారిపల్లెకు చెందిన మురళీ కుమారుడు అభిలాష్ (20), గుండ్లపల్లెకు చెందిన మాబూషరీఫ్ కుమారుడు బావాజాన్(25) అమరరాజా గ్రోత్ కారిడార్‌లో పనిచేస్తున్నారు. ముగ్గురూ గురువారం రాత్రి 10 గంటలకు విధులు ముగించుకుని కంపెనీ నుంచి బైక్‌పై ఇళ్లకు బయలుదేరారు. మార్గం మధ్యలో తేనేపల్లె లేఅవుట్ వద్ద కడప నుంచి చిత్తూరు వైపు వెళుతున్న ఐషర్ వాహనం వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయికుమార్, అభిలాష్ అక్కడిక్కడే మృతి చెందగా, బావాజాన్‌కు తీవ్రమైన గాయలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వేలూరు సీఎంసీకి తీసుకువెళ్లారు. యువకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్‌భూపాల్ తెలిపారు. మృతుల తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.




సాయికుమార్ (ఫైల్) అభిలాష్ (ఫైల్)